క్లుప్తంగా

నీటిని పొదుపుగా వాడుకోవాలి

పీసీపల్లి: భూగర్భ జల నీటిని జాగ్రత్తగా వాడుకోవాలని సీపీఐ నాయకుడు జీపీ రామారావు అన్నారు. మండల పరిధిలోని రామాపురం బీసీకాలనీలో ఏర్పాటు చేసిన నూతన కుళాయిని ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ భూగర్భ జల నీటి సంరక్షించాలన్నారు. కార్యక్రమంలో రత్తయ్య, శ్రీను, నరసింహులు, బ్రహ్మయ్య, మోహన్ తదితరులు పాల్గొన్నారు.

వైఎస్సార్ రైతు భరోసాకు దరఖాస్తు చేసుకోవాలి

పామూరు: వైఎస్సార్ రైతుభరోసా 2023–24 సంబంధించి గతంలో లబ్ధి పొందని, కొత్త రైతులు, భూములు కొనుగోలుచేసి రైతు భరోసా పొందని వారు స్థానిక రైతుభరోసా కేంద్రంలో దరఖాస్తు చేసుకుని ఆన్‌లైన్‌లో పేర్లు నమోదు చేయించుకోవాలని ఏఓ కంచం రాధ మంగళవారం తెలిపారు. దరఖాస్తు చేసుకునేందుకు రైతులు వారి ఆధార్, పొలానికి సంబంధించిన 1–బీ నకలు, సెల్‌నంబర్ కార్యాలయంలో ఇవ్వాల్సి ఉంటుందని రైతులు అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

ఓటరు సర్వేలో 8,519 దరఖాస్తులు

సింగరాయకొండ: మండలంలో బీఎల్ఓలు నిర్వహించిన ఇంటింటి ఓటరు సర్వే కార్యక్రమంలో 8,519 దరఖాస్తులు వచ్చినట్లు తహసీల్దార్ సీహెచ్ ఉష తెలిపారు. మండలంలోని 15 గ్రామ సచివాలయాల పరిధిలో 52,285 మంది ఓటర్లు ఉన్నారని పేర్కొన్నారు. బీఎల్ఓలు నిర్వహించిన సర్వేలో కొత్త ఓటర్ల నమోదుకు 1,022, మరణించినవారు, మైగ్రేషన్ ఓటర్లకు సంబంధించి 1,916, ఓటరు జాబితాలో సవరణలకు సంబంధించి 4,406, పోలింగ్ బూత్‌ల మార్పిడికి సంబంధించి 1,175 దరఖాస్తులు వచ్చాయని వివరించారు. ఈ దరఖాస్తులను పరిశీలించి నూతన ఓటరు జాబితా సిద్ధం చేస్తామని పేర్కొన్నారు.

విద్యార్థులకు క్రీడా సామగ్రి బహూకరణ


విద్యార్థులకు క్రీడా సామగ్రి అందిస్తున్న దాత

టంగుటూరు: స్థానిక జిల్లా పరిషత్ పాఠశాల విద్యార్థులకు మాజీ సర్పంచ్ బెల్లం జయంత్‌బాబు క్రీడాదుస్తులు, ఆట వస్తువులు, మైక్ సెట్‌ను మంగళవారం బహూకరించారు. విద్యార్థులు క్రమశిక్షణతో చదివి ఉన్నత స్థాయికి చేరుకోవాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో సర్పంచి మద్దిరాల మమత, ఉపాధ్యాయులు డి.శ్రీధర్, ఉపసర్పంచ్ మక్కెన కోటేశ్వరరావు, బి.వెంకటేశ్వర్లు, హెచ్‌ఎం తులసి ప్రభ, గద్దల యాకోబు, పీడీ అరుణ, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ఎంపీడీఓగా సుకుమార్ బాధ్యతల స్వీకరణ


ఎంపీడీఓకు స్వీట్లు తినిపిస్తున్న సర్పంచ్ సురేష్‌బాబు

వెలిగండ్ల: ఎంపీడీఓగా తాతపూడి సుకుమార్ మంగళవారం బాధ్యతలు చేపట్టారు. గుంటూరు జిల్లా నుంచి పదోన్నతిపై వెలిగండ్ల ఎంపీడీఓగా సీహెచ్ రామచంద్రరావు సోమవారం విధుల్లో చేరారు. అయితే సీహెచ్ రామచంద్రారావును సీఎస్‌పురం ఎంపీడీఓగా ఎఫ్ఏసీగా నియమిస్తూ ఉత్తర్వులు జారీ కావడంతో వెలిగండ్ల ఎంపీడీఓగా టి.సుకుమార్‌ను నియమిస్తూ ఉత్తర్వులు జారీ చేశారు. ఈ సందర్భంగా వెలిగండ్ల సర్పంచ్ టి. సురేష్‌బాబు, ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ పవన్‌కుమార్, టీఏ మనోహర్, సీనియర్ అసిస్టెంట్ షేక్ ఖాదర్‌బాషా, పలువురు అధికారులు, ప్రజాప్రతినిధులు ఎంపీడీఓను అభినందించారు.

మెనూ కచ్చితంగా పాటించాలి

పీసీపల్లి: మధ్యాహ్న భోజన పథకంలో కచ్చితంగా మెనూ పాటించాలని ఎంఈఓ ఆర్ శ్రీనివాసులు అన్నారు. స్థానిక జెడ్పీ హైస్కూల్‌ను ఎంఈఓ శ్రీనివాసులు, ఎంపీడీఓ ఆర్ శ్రీనివాసులరెడ్డి మంగళవారం తనిఖీ చేశారు. ఈ సందర్భంగా మెనూ అమలు చేయకపోవడంపై కుకింగ్ ఏజెన్సీపై ఆగ్రహం వ్యక్తం చేశారు. అనంతరం విద్యాకమిటీ చైర్మన్ వేమూరి సుబ్బారావు ఒక రోజుకు సరిపడే బియ్యాన్ని అందిస్తానన్నారు. వీరి వెంట మండల కన్వీనర్ గోపవరపు బొర్రారెడ్డి, ఓకేరెడ్డి, వైస్ చైర్మన్ బసవయ్య చౌదరి ఉన్నారు.

నూతన పింఛన్లు మంజూరు

ఉలవపాడు: మండలానికి నూతనంగా 467 పింఛన్లు మంజూరయ్యాయి. ఈ నెల ఒకటిన 203 పింఛన్లు మంజూరు కాగా, ఈ నెల 12న అదనంగా మరో 264 పింఛన్లు మంజూరు చేసినట్లు ఎంపీడీఓ చెంచమ్మ తెలిపారు. మొత్తం 467 పింఛన్లకు గాను రూ.12,49,500 అదనంగా వచ్చినట్లు పేర్కొన్నారు. ఆత్మకూరు కు 27, బద్దిపూడికి 16, భీమవరం–1కు 21, భీమవరం–2కు 28, చాగల్లుకు 27, చాకిచర్లకు 57, కరేడు–1కు 34, కరేడు–2 కు 49, కరేడు–3 కు 32, మన్నేటికోటకు 25, పెదపట్టపుపాలెం 32, రామాయపట్నం 20, ఉలవపాడు–1కు 24, ఉలవపాడు–2కు 37, ఉలవపాడు–3కు 24, వీరేపల్లికి 20 నూతన పింఛన్లు మంజూరైనట్లు పేర్కొన్నారు. వీరికి ఈ నెల 14 లోగా వలంటీర్లు నగదు పంపిణీ చేస్తారన్నారు.

మహిళలు పారిశ్రామికవేత్తలుగా రాణించాలి

- రాష్ట్ర ప్రభుత్వ లక్ష్యం అదే..
- డీఆర్‌డీఏ డీపీఎం బత్తుల సుబ్బారావు

సింగరాయకొండ: రాష్ట్ర ప్రభుత్వం నూతన మహిళా పారిశ్రామికవేత్తలను సృష్టించడమే లక్ష్యంగా కృషి చేస్తోందని డీఆర్‌డీఏ డీపీఎం బి.సుబ్బారావు పేర్కొన్నారు. అందులో భాగంగానే డ్వాక్రా గ్రూపు మహిళలకు యూనిట్ల ఏర్పాటుకు బ్యాంకుల ద్వారా రూ.2 లక్షల నుంచి రూ.10 లక్షలకు పైగా వ్యక్తిగత హామీపై రుణాలిస్తున్నట్లు తెలిపారు. స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో మంగళవారం నియోజకవర్గ స్థాయి బ్యాంకర్లు, ఐకేపీ అధికారులతో ప్రభుత్వ పథకాల అమలుపై సమీక్ష నిర్వహించారు. డీపీఎం మాట్లాడుతూ.. ప్రతి మండలంలో 50 మంది మహిళలకు రుణాలివ్వాలని ప్రతి బ్యాంకర్ తప్పనిసరిగా ఇద్దరికి రుణం మంజూరు చేయాలని సూచించారు. గతంలో రుణాలకు సంబంధించి డాక్యుమెంటేషన్ కార్యక్రమం బ్యాంకరే చూసుకునే వారని, వారు రుణం సక్రమంగా కడతారా లేదా అని పరిశీలించుకునేవారని, కానీ ప్రస్తుతం డీఆర్‌డీఏ అధికారులే డాక్యుమెంటేషన్ అంతా పూర్తి చేస్తారని చెప్పారు. రుణాల రికవరీ బాధ్యత కూడా వీఓఏలే చూస్తారని స్పష్టం చేశారు. నియోజకవర్గంలో జగనన్న తోడు పథకానికి సంబంధించి ఈ నెలాఖరులోపు 2,757 మందికి రుణం ఇవ్వాలని లక్ష్యంగా నిర్ణయించగా ఇప్పటి వరకు 637 మందికి రుణం మంజూరు చేశారన్నారు. లక్ష్యాన్ని త్వరగా పూర్తి చేయాలని సూచించారు. సింగరాయకొండ మండలంలో 10 లక్షలతో బాతుల హేచరీస్, బిస్కెట్ ఫ్యాక్టరీకి రుణాలిచ్చినట్లు తెలిపారు. యూనియన్ బ్యాంకు వారు


బ్యాంకర్ల సమావేశంలో మాట్లాడుతున్న డీఆర్‌డీఏ డీపీఎం సుబ్బారావు

నారీ–భేరి పథకం కింద లబ్ధిదారుకు 1.50 లక్షల రూపాయలు ఇస్తున్నారని అయితే యూనిట్లు గ్రౌండ్ చేస్తున్నారా లేదా అనే పర్యవేక్షణ లేదన్నారు. జగనన్న బడుగు వికాసం పథకం ద్వారా ఎస్సీ, ఎస్టీలకు సబ్సిడీ రుణాలివ్వాలన్నారు. లబ్ధిదారుల నుంచి ఇన్సూరెన్స్, డిపాజిట్లు వసూలు చేయరాదన్నారు. ఇప్పటివరకు బ్యాంకర్లు చేసిన ఇన్సూరెన్స్‌లకు సంబంధించి ఒక్కదానికి కూడా క్లెయిమ్ రాలేదని గుర్తు చేశారు. కేవలం తక్కువ ప్రీమియం ఉన్న జేజేబీవై, ఎస్‌బీవై ఇన్సూరెన్స్‌లు మాత్రమే చేయాలని సూచించారు. జిల్లా లీడ్ బ్యాంకు మేనేజర్ షేక్ అబ్దుల్ రహీం మాట్లాడుతూ రైతులకు వ్యవసాయ రుణాలు, కౌలు రైతుల రుణాలు, పాడి రైతుల రుణాలు, జగనన్న పాలవెల్లువ రుణాలు సక్రమంగా సకాలంలో అందించాలని బ్యాంకర్లకు దిశానిర్దేశం చేశారు. ప్రభుత్వ రుణాల మంజూరుపై బ్యాంకర్లతో సమీక్ష నిర్వహించారు. సిండికేట్ బ్యాంకు మేనేజర్ కంచర్ల సౌమ్య, ఏపీఎం డి.జయరాజ్, నియోజకవర్గంలోని ఆరు మండలాల బ్యాంకర్లు, ఐకేపీ అధికారులు పాల్గొన్నారు.



కనిగిరి నియోజకవర్గ సమీక్ష సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే బుర్రా మధుసూదన్ యాదవ్, హాజరైన నియోజకవర్గ స్థాయి ప్రజాప్రతినిధులు, నేతలు

ఎన్నికల విధులు సక్రమంగా నిర్వర్తించాలి

- నియోజకవర్గ ఎన్నికల రిటర్నింగ్ అధికారి నారదముని

కొండపి(సింగరాయకొండ): ఎన్నికల విధులను బీఎల్ఓలు నిబద్ధతతో నిర్వర్తించాలని నియోజకవర్గ ఎన్నికల రిటర్నింగ్ అధికారి నారదముని సూచించారు. కొండపి రెవెన్యూ కార్యాలయంలో మంగళవారం ఎన్నికల విధులపై బీఎల్ఓలు, రాజకీయ పార్టీల ప్రతినిధులతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఈఆర్ఓ మాట్లాడుతూ.. బీఎల్ఓల సర్వేలో ఫారం 6,7,8 లకు సంబంధించి ఆరు మండలాల్లో వచ్చిన దరఖాస్తులపై సమీక్ష నిర్వహించామన్నారు. నియోజకవర్గంలో 10,129 మంది మరణించినవారు, మైగ్రెంట్లు ఉన్నారని, వారి ఓట్లు తొలగించాలంటూ టీడీపీ నాయకులు ఎన్నికల కమిషన్‌ను ఆశ్రయించారని, అయితే వారు చెప్పిన దరఖాస్తులను పరిశీలించగా అంతమంది లేరని స్పష్టం చేశారు. అర్హులైన వారి పేర్లు ఉంచి మిగిలిన వారిని జాబితా నుంచి తొలగించాలని


కొండపిలో ఓటర్ల సర్వేపై సమీక్షిస్తున్న ఎన్నికల అధికారి నారదముని

ఆదేశించామన్నారు. నియోజకవర్గంలో 283 పోలింగ్ బూత్‌లు ఉండగా, 1,500 కంటే ఎక్కువ ఓటర్లు ఉన్నచోట అదనపు పోలింగ్ బూత్ ఏర్పాటు చేయాలని సూచించామన్నారు. వాస్తవానికి నియోజకవర్గంలో 1,500 కన్నా ఎక్కువ ఓటర్లు ఉన్న పోలింగ్ బూత్‌లు లేవన్నారు. శిథిలావస్థకు చేరిన పోలింగ్ కేంద్రాలను నిర్ధారిస్తే ఆ వివరాలు త్వరగా అందజేయాలని కోరారు. సమీక్షలో ఆరు మండలాల రెవెన్యూ అధికారులు, రాజకీయ పార్టీల ప్రతినిధులు పాల్గొన్నారు.

మహిళా పాడి రైతులకు రుణాలు

- పశుసంవర్ధకశాఖ ఏడీ డాక్టర్ రవికుమార్

కొండపి(సింగరాయకొండ): రైతు భరోసా కేంద్రాల వద్ద ఏర్పాటు చేసిన అమూల్ పాల కేంద్రాల్లో పాలు పోసే ప్రతి మహిళా పాడి రైతుకు జగనన్న పాల వెల్లువ కార్యక్రమంలో భాగంగా రుణ సౌకర్యం కల్పిస్తున్నట్లు పశుసంవర్ధక శాఖ అసిస్టెంట్ డైరెక్టర్ డాక్టర్ ఎం.రవికుమార్ పేర్కొన్నారు. కొండపి మండల కేంద్రంలోని ఆర్బీకేలో మంగళవారం మహిళా పాడి రైతులకు రుణమేళా కార్యక్రమం నిర్వహించారు. డాక్టర్ రవికుమార్ మాట్లాడుతూ.. పాడి పశువుల కొనుగోలుకు రూ.లక్ష నుంచి రూ.2 లక్షల వరకు, పాడి పశువుల మేపు ఖర్చులకు ఒక్కో గేదెకు రూ.25 వేల నుంచి రూ.30 వేల వరకు గరిష్టంగా రూ.1.50 లక్షల


కొండపిలో జగనన్న పాలవెల్లువ రుణమేళాలో పాల్గొన్న అధికారులు

వరకు రుణంగా ఇవ్వనున్నట్లు వివరించారు. కె.ఉప్పలపాడు పశువైద్యాధికారి బి.పేరయ్య, డీఆర్‌డీఏ అధికారులు పాల్గొన్నారు.

సర్వేను పకడ్బందీగా నిర్వహించాలి


గుడ్లూరు: గ్రామాల్లో ఈ నెల15 నుంచి జరగనున్న జగనన్న ఆరోగ్య సురక్ష సర్వేను పకడ్బందీగా నిర్వహించాలని తహసీల్దార్ సూర్యనారాయణసింగ్, ఎంపీడీఓ వెంకటేశ్వరరావు, వైద్యాధికారి మారుతీరావు అన్నారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమంపై వైద్య సిబ్బంది, వలంటీర్లు, ఎంఎల్‌హెచ్‌పీలకు మంగళవారం శిక్షణ నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ వైద్య సిబ్బంది, వలంటీర్లు గ్రామాల్లో ప్రతి ఇంటికి వెళ్లి ఇంట్లో అందరికీ వైద్య పరీక్షలు నిర్వహించి వారికి ఉన్న ఆరోగ్య లోపాలను గుర్తించి యాప్‌లో నమోదు చేయాలన్నారు. గ్రామ వలంటీర్లు ఆరోగ్య సురక్షపై గ్రామాల్లో ముందుగా ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు. సర్వేను పారదర్శకంగా నిర్వహించాలన్నారు. కార్యక్రమంలో ఎంఈఓ గోవర్ధన్ సూపర్‌వైజర్ కామేశ్వరీ, హెచ్‌ఈఓ ఆరీఫ్, సీహెచ్‌ఓ భాస్కరరావు, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

వలేటివారిపాలెం: జగనన్న ఆరోగ్య సురక్ష పథకం అవగాహన సదస్సు స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో మంగళవారం ఎంపీడీఓ షేక్ రఫీక్‌అహ్మద్ అధ్యక్షతన నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండలంలో ఈ నెల 3వ తేది నుంచి 21వ తేదీ వరకు జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమం నిర్వహిస్తామని తెలిపారు. ఈ సందర్భంగా సమావేశంలో జగనన్న సురక్ష సర్వేకు సంబంధించి వలంటీర్లు, ఏఎన్ఎమ్‌లు, ఎంఎల్‌హెచ్‌పీలు చేయాల్సిన విధానాలపై అవగాహన కల్పించారు. తహశీల్దార్ సుందరమ్మ, డాక్టర్లు మణిదీపిక, శివసిద్ధప్ప, ఎంఈఓ రవికుమార్, పంచాయతీ కార్యదర్శులు, ఆరోగ్య కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.


జగనన్న ఆరోగ్య సురక్షపై శిక్షణ ఇస్తున్న అధికారులు

చిరుధాన్యాలతో ఆరోగ్యం పదిలం

గుడ్లూరు: గర్భిణులు గర్భవతులు పోషక విలువలు ఉన్న చిరుధాన్యాలను ఆహారంగా తీసుకుంటే పుట్టే బిడ్డలు ఆరోగ్యవంతంగా ఉంటారని ఐసీడీఎస్ తెట్టు సెక్టార్ సూపర్‌వైజర్ కామేశ్వరీ అన్నారు. పౌష్టికాహార వారోత్సవాలలో భాగంగా మండలంలోని పోట్లూరులో మంగళవారం పోషణ మహా కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా కామేశ్వరి మాట్లాడుతూ గర్భిణులు, బాలింతలు తక్కువ ఖర్చుతో ఎక్కువ పోషక విలువలు ఉన్న ఆకుకూరలు, కూరగాయలు, మొలకెత్తిన గింజలు, పండ్లు, చిరుధాన్యాలు తీసుకుంటే ఆరోగ్యవంతంగా ఉంటారన్నారు. రాష్ట్ర ప్రభుత్వం పౌష్టికాహార లోపాన్ని నివారించడానికి మంచి పోషక విలువ ఉన్న పౌష్టికాహారాన్ని అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా అందచేస్తుందన్నారు. ప్రతి అంగన్‌వాడీ కేంద్రంలో బరువు తక్కువ ఉన్న చిన్నారులను గుర్తించి వారికి బలవర్ధకమైన ఆహారం అందించాలన్నారు. కార్యక్రమంలో వైద్య సిబ్బంది లావణ్య, పద్మ, మహిళా పోలీస్ సంధ్యారాణి, అంగన్‌వాడీ కార్యకర్తలు రమాదేవి,అ మీరున్నీసా, క్రిష్ణకుమారిలు పాల్గొన్నారు.


పోట్లూరులో మాట్లాడుతున్న కామేశ్వరి

సచివాలయ సిబ్బందిపై ఆగ్రహం

జరుగుమల్లి: మండలంలోని నర్సింగోలు, చతుకుపాడు గ్రామ సచివాలయాల సిబ్బందిపై జిల్లా గ్రామ/వార్డు సచివాలయాల పర్యవేక్షణాధికారి ఉషారాణి ఆగ్రహం వ్యక్తం చేశారు. సచివాలయ సిబ్బంది విధులు సక్రమంగా నిర్వర్తించాలని ఆదేశించారు. పనులపై సచివాలయానికి వచ్చే ప్రజలను ఇబ్బంది పెట్టకుండా సమస్యలు పరిష్కరించాలని స్పష్టం చేశారు. నర్సింగోలు గ్రామంలో మీసేవా కేంద్రం నిర్వాహకుల తీరుపై ఆగ్రహం వ్యక్తం చేశారు. సక్రమంగా సేవలు అందించకపోతే కేంద్రాన్ని రద్దు చేస్తామని హెచ్చరించారు. ఇన్‌చార్జి ఎండీపీఓ పి.రామకృష్ణ, సచివాలయ కార్యదర్శులు పాల్గొన్నారు.


సచివాలయ సిబ్బందితో మాట్లాడుతున్న ఉషారాణి

పౌష్టికాహారంతో ఆరోగ్యం

జరుగుమల్లి: పౌష్టికాహారం తీసుకుంటే ఆరోగ్యంగా ఉండవచ్చని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ షేక్ సైదాబీ పేర్కొన్నారు. పోషణ మాసోత్సవాల్లో భాగంగా చింతలపాలెం అంగన్‌వాడీ కేంద్రంలో గర్భిణులు, బాలింతలు, చిన్నారులకు పౌష్టికాహారం ప్రాధాన్యతపై మంగళవారం అవగాహన కల్పించారు. అలాగే కామేపల్లి అంగన్‌వాడీ కేంద్రంలో సూపర్‌వైజర్ విజయరూత్ సూచనలు, సలహాలు ఇచ్చారు. తక్కువ ఖర్చుతో ఎక్కువ పోషక విలువలు కలిగిన ఆహార పదార్థాలు తయారు చేసుకోవడం గురించి వివరించారు. ఆకుకూరలు, చిరుధాన్యాలు ఆహారంలో ఉండేలా చూసుకోవాలని చెప్పారు. రాష్ట్ర ప్రభుత్వం అందిస్తున్న వైఎస్సార్ సంపూర్ణ పోషణ కిట్‌ను గర్భిణులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఆయా కార్యక్రమాల్లో అంగన్‌వాడీ సిబ్బంది పాల్గొన్నారు.

పోషకాహారం తీసుకోవాలి

ఉలవపాడు: తల్లులు, గర్భవతులు పోషకాహారం తప్పనిసరిగా తీసుకోవాలని సీడీపీఓ విజయకుమారి అన్నారు. పోషణ మాసోత్సవాల్లో భాగంగా ఉలవపాడులోని 1వ, 8వ కేంద్రాలలో జరిగిన కార్యక్రమాల్లో ఆయన మాట్లాడారు. అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా అందించే అనుబంధ ఆహారంలో పోషకవిలువలు ఉన్నాయని తెలియచేశారు. వైఎస్సార్ కిట్లలో ఉండే పోషకాహారం తప్పనిసరిగా తీసుకోవాలని తెలిపారు. బియ్యంలో ఫోర్టిఫైడ్ రైస్ ఉంటాయని, ఆ బియ్యంతో అన్నం చేసుకొని తినాలన్నారు. పోషకాహార విలువలు ఉన్నచిరుధాన్యాలను తీసుకోవాలన్నారు. ముర్రుపాల ఆవశ్యకత గురించి తల్లులకు వివరించారు. సూపర్‌వైజర్ అంజమ్మ, అంగన్‌వాడీ కార్యకర్తలు, ఆయాలు పాల్గొన్నారు.

ఆటో వర్కర్స్ యూనియన్ కార్యవర్గం ఎన్నిక


కందుకూరు: ఏఐటీయూసీ అనుబంధమైన విప్పగుంట రోడ్డు ఆటో వర్కర్స్ యూనియన్ నూతన కార్యవర్గం ఏకగ్రీవంగా ఎన్నికైంది. ఈ మేరకు మంగళవారం స్థానిక సీపీఐ కార్యాలయంలో జరిగిన సమావేశంలో ఎన్నుకున్నారు. ఆటో వర్కర్స్ యూనియన్ అధ్యక్షుడిగా చదలవాడ రమేష్, కార్యదర్శిగా గడ్డం రవితో పాటు మరో 9 మంది కార్యవర్గ సభ్యులను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఆటో వర్కర్స్ సమస్యలపై నూతన కార్యవర్గం పోరాడతాని తెలిపారు. కార్యక్రమంలో ఏఐటీయూసీ నియోజకవర్గ కార్యదర్శి వై ఆనందమోహన్, బల్లిపల్లి మాల్యాద్రి, నజీర్, బెంగుళూరు సుధాకర్ తదితరులు పాల్గొన్నారు.

గణేష్ మండపాల ఏర్పాటులో నిబంధనలు పాటించాలి

సింగరాయకొండ: వినాయక చవితి సందర్భంగా మండలంలో గణేష్ మండపాలు ఏర్పాటు చేసే వారు పోలీసుల అనుమతి తీసుకోవాలని ఎస్సై టి.శ్రీరామ్ మంగళవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. నిర్వాహకులు తమ వివరాలు తెలియజేయడంతోపాటు, ఫైర్, విద్యుత్ శాఖ అనుమతి తీసుకోవాలని, లౌడ్ స్పీకర్లు ఉదయం 6 నుంచి రాత్రి 10 గంటల వరకు మాత్రమే ఉపయోగించాలని స్పష్టం చేశారు. విగ్రహాల నిమజ్జన ఊరేగింపులో నిబంధనలకు అనుగుణంగా నడుచుకోవాలని, విగ్రహాల వద్ద భద్రతను నిర్వాహకులే ఏర్పాటు చేసుకోవాలని సూచించారు. నిబంధనలు అతిక్రమిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

ఫ్యామిలీ డాక్టర్‌తో మెరుగైన వైద్యం

జరుగుమల్లి: గ్రామీణులకు ఇంటి వద్దనే వైద్య సేవలు అందించాలనే ఉద్దేశంతో ఫ్యామిలీ డాక్టర్ విధానాన్ని రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టినట్లు వైద్యాధికారి జి.రేష్మి పేర్కొన్నారు. మండలంలోని నందనవనం గ్రామంలో మంగళవారం ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమాన్ని నిర్వహించారు. 104 వైద్య శిబిరంలో 53 మంది రోగులకు వైద్య పరీక్షలు చేసి మందులు పంపిణీ చేశారు. పక్షవాతంతో బాధపడుతు మంచానికే పరిమితమైన దాసరి నారాయణ ఇంటికి వైద్య సిబ్బందితో వెళ్లిన డాక్టర్ రేష్మి మందులు అందజేశారు. సీజనల్ వ్యాధులపై గ్రామస్తులకు అవగాహన కల్పించారు.


ఇంటి వద్దే రోగికి వైద్య సేవలు అందిస్తున్న డాక్టర్ రేష్మి

హనుమంతునిపాడు: ఇంటింటికీ ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమంలో భాగంగా మంగళవారం హనుమంతాపురంలో 72 మందికి వైద్య పరీక్షలు నిర్వహించారు. డాక్టర్ సందీప్ దీర్ఘకాలిక వ్యాధులతో బాధపడుతున్న వారికి ఇంటింటికి తిరిగి పరీక్షలు చేశారు. వ్యాధి నివారణకు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై సలహాలు సూచలించి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. ఎంఎల్‌హెచ్‌పీలు, ఏఎన్ఎంలు, ఆశాలు, ఆరోగ్య సిబ్బంది, 104 వాహన సిబ్బంది ఉన్నారు.

ఉత్సాహంగా ఆటల పోటీలు


పోటీలను ప్రారంభిస్తున్న ఎంఈఓ పెద్దిరాజు


పీసీపల్లిలో కబడ్డీ ఆడుతున్న క్రీడాకారులు

హనుమంతునిపాడు: స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆఫ్ ఆంధ్రప్రదేశ్ ఆధ్వర్యంలో మంగళవారం అండర్ 14, 17 అండర్ క్రీడా పోటీలను మండల స్థాయి పోటీలు ఎంఈఓ జి.పెద్దిరాజు ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండల స్థాయిలో నిర్వహించే పోటీల్లో బాల బాలికలు ప్రతిభ చూపాలన్నారు. మండల స్థాయిలో గెలిచిన జట్లను నియోజకవర్గస్థాయి పోటీలకు పంపిస్తామన్నారు. అండర్–14, 17 విభాగాల్లో కబడ్డీ, ఖోఖో, వాలీబాల్, త్రోబాల్, బాల్ బ్యాడ్మింటన్, యోగా, అథ్లెటిక్స్, రింగ్‌బాల్, వాలీబాల్ పోటీలు నిర్వహించారు. పీడీ షేక్ జిలానీ, కాంప్లెక్స్ చైర్మన్ జీవీ సురేష్‌బాబు, అసిస్టెంట్ హెచ్‌ఎం బొప్పరాజు సుబ్బారావు, ఉపాధ్యాయులు, పీఈటీలు పాల్గొన్నారు.

పీసీపల్లి: స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆఫ్ ఏపీ ఆధ్వర్యంలో మంగళవారం స్థానిక జెడ్పీహెచ్ఎస్‌లో ఆటల పోటీలు ప్రారంభమయ్యాయి. తొలిరోజు 300 మంది క్రీడాకారులు క్రీడల్లో పాల్గొన్నారు. కబడ్డీ, ఖోఖో, టెన్నికాయిడ్ పోటీలు నిర్వహించారు. మండల స్థాయిలో జరిగిన క్రీడల్లో గెలుపొందిన విజేతలను నియోజకవర్గ స్థాయి క్రీడలకు ఎంపిక చేస్తామని తెలిపారు.

పూసా హైడ్రోజల్‌పై రైతులకు అవగాహన

జరుగుమల్లి: బెట్ట పరిస్థితులను తట్టుకుని మొక్కకు అవసరమైన తేమ పోషకాలను అందించే పూసా హైడ్రోజల్‌పై మండలంలోని ఎడ్లూరపాడు గ్రామంలో ఆత్మ ఆధ్వర్యంలో వ్యవసాయ శాఖ అధికారులు మంగళవారం అవగాహన కల్పించారు. రావి లింగప్పనాయుడు సాగు చేస్తున్న మిరప తోటలో ప్రయోగాత్మకంగా పూసా హైడ్రోజల్‌ను పశువుల ఎరువుతో కలిపివేశారు. పూసా హైడ్రోజల్ ప్రయోజనాలను వివరించారు. వ్యవసాయాధికారి డి.యుగంధరరెడ్డి, ఆత్మ ప్రాజెక్టు డైరెక్టర్ అన్నపూర్ణ, సర్పంచి రావి శ్రీనివాసరావు, వ్యవసాయాధికారిణులు శైలజ, శేషమ్మ, గ్రామ వ్యవసాయ సహాయకులు, రైతులు పాల్గొన్నారు.


రైతులకు అవగాహన కల్పిస్తున్న వ్యవసాయ శాఖాధికారులు

అవ్వాతాతలకు వైఎస్సార్ పెన్షన్ కానుక వరం

పామూరు: వైఎస్సాఆర్ పెన్షన్ కానుక అవ్వాతాతలకు వరం లాంటిదని వైఎస్సార్ సీపీ యూత్, రైతు విభాగం మండల అధ్యక్షుడు కందుల శ్రీనివాసరెడ్డి అన్నారు. మండలంలోని దూబగుంట్ల సచివాయంలో మంగళవారం జరిగిన కార్యక్రమంలో సచివాలయ పరిధిలో నూతనంగా మంజూరైన 17 మంది లబ్ధిదారులకు వైఎస్సార్ పెన్షన్ కానుక అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పార్టీ, కులం, మతాలకు అతీతంగా అర్హతే ప్రామాణికంగా సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సంక్షేమ పథకాలు అమలు చేస్తున్నారన్నారు. కుందురు మాల్యాద్రిరెడ్డి, దుగ్గిరెడ్డి రామచంద్రారెడ్డి, పాల్గొన్నారు.


పెన్షన్లు పంపిణీ చేస్తున్న అధికారులు, నాయకులు

జంప్‌రోప్ పోటీల్లో చేవూరు విద్యార్థుల ప్రతిభ

గుడ్లూరు: గుంటూరు జిల్లా తెనాలిలో జరిగిన జంప్‌రోప్ పోటీలలో మండలంలోని చేవూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులు మంచి ప్రతిభ చూపి మూడు పతకాలు సాధించినట్లు పాఠశాల ప్రధానోపాధ్యాయుడు ఎన్.శ్రీనివాసులు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పాఠశాలకు చెందిన ఐదుగురు విద్యార్థులు రాష్ట్ర స్థాయి జంప్‌రోప్ పోటీలలో పాల్గొన్నారు. జూనియర్ విభాగంలో 7వతరగతికి చెందిన విష్ణుతేజ వెండిపతకం, జాస్మిన్ కాంస్యపతకాలు సాధించగా సబ్ జూనియర్ విభాగంలో రాకేష్ కాంస్యపతకం సాధించినట్లు ఆయన తెలిపారు. పతకాలు సాధించిన ముగ్గురు విద్యార్థులను వారికి శిక్షణ ఇచ్చిన పీఈటీ శివరావమ్మలను హెచ్‌ఎం శ్రీనివాసులు, టీపీ మాలకొండయ్య,ఉపాధ్యాయులు,గ్రామస్తులు అభినందించారు.


చేవూరులో పతకాలు సాధించిన విద్యార్థులతో ఉపాధ్యాయులు